అధిక ధరలు తగ్గించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి : సీపీఎం నిరసన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : అధిక ధరలు తగ్గించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక కొన్నావీధి సచివాలయంవద్ద జరిగిన నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా నిరసన తెలియజేస్తూ వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం వచ్చాక ప్రజల కష్టాలు పెరిగాయని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీల పెంపు అధికంగా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలన్నీ మూసివేస్తున్నారని, బడాబాబులకు లక్షల కోట్లు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి మోడీ విధానాలకు గుడ్డిగా తలూపుతున్నాడన్నారు. ప్రత్యేక హెూదా, విభజన చట్టంలోని హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోగల నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని కోరారు. విద్యుత్ బిల్లులు తగులబెట్టారు. అనంతరం సచివాలయంలో కార్యదర్శికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.గోవర్ధన్ రావు, ఎల్.మహేష్, ఏ.సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, పార్వతి, ధనలక్ష్మి, జానకిరామ్, ఎం.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను గుర్తించాలి

విశాలాంధ్ర -సారవకోట/నరసన్నపేట: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే గ్రామీణ క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్, బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలో సారవకోట గ్రామంలో ఉజ్జయిని మహంకాళి వాలీబాల్ టోర్నమెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య ధృడత్వానికి ప్రతీకని తెలిపారు. క్రీడల్లో ఉత్తమంగా రాణించి, గ్రామాలకు పేరు తెచ్చేలా క్రీడాకారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల అధ్యక్షులు, కత్తిరి వెంకటరమణ, ఐటిడిపి కన్వీనర్, సురవరపు తిరుపతి, నరసన్నపేట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, భైరి భాస్కరరావు, మాజీ ఎంపిటిసి, కోన వెంకటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి : డిప్యూటీ డీఈఓ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డిఈఓ, బి పగడాలమ్మ అన్నారు. శుక్రవారం బోరుభద్ర, వల్లేవలస వడ్డివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వము విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, తదనుగుణంగా ఉపాధ్యాయులు మరింత భాధ్యతతో విధులు నిర్వహించాలని, ప్రతీ ఉపాధ్యాయుడు సమయపాలన పాటిస్తూ, సిలబస్ సక్రమంగా పూర్తిచేయాలని, డైరీ, లెసన్ ప్లాన్స్, టీచింగ్ నోట్స్ వ్రాసి ఉండాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం పదవ వతరగతి క్లాసులను పరిశీలిస్తూ, సిలబస్ ఎంతవరకు పూర్తి అయింది అని తెలుసుకుంటూ విద్యార్థులకు చెందిన నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, చాలా శ్రద్ధతో చదువుతూ మంచి మార్కులతో అందరూ ఉత్తీర్ణత సాధించి తల్లితండ్రులకు, పాఠశాలకు జిల్లాకు పేరు తీసుకు రావాలని ఉద్బోధించారు. మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి వంట తీరుపట్ల సంతృప్తిని వ్యక్తము చేశారు. వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, రామక్రిష్ణ, టి భాస్కరరావు, ధనుంజయరావు సీఆర్పీలు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు సేవలందించటమే 'జనసేన' లక్ష్యం

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవలందించ టమే జనసేన పార్టీ లక్ష్యమని జనసేన మండల అధ్యక్షులు, బలగ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధినేత, పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సంధర్భంగా ఏర్పాటు చేసిన మహాదాన రక్తదాన శిబిరంలో జనసైనికులు, వీర మహిళలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షులు, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి, మోక్షజ్ఞ బ్లడ్ బ్యాంక్ సంస్థకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నందిపల్లి దండాసి, వారాది వరలక్ష్మీ, తనకాల శంకర్, అప్పలస్వామి, బుజ్జి, సంతోష్, విష్ణు, శ్రీకాంత్, క్రాంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి : జనసేన ఇన్‌చార్జ్ 'పేడాడ'

విశాలాంధ్ర-ఆమదాలవలస : రక్తదానంతో ప్రాణదాతలు కావాలని జనసేన ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్ గా ఉన్నారు. స్థానిక బ్రిడ్జ్ డౌన్ ప్రాంతంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆముదాలవలస టౌన్ యువసేన ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 48 మంది రక్తదానం చేసిన వారిలో ఉన్నారు. వీరికి సర్టిఫికెట్స్ అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అధినేత జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలబడడానికి ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. అలాగే జనసేన పార్టీ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందు వరసలో ఉండి ఆదర్శంగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీమోహన్, ఆమదాలవలస టౌన్ నాయకులు పాత్రుని పాపారావు, శిర్లాపు గణేష్, గంగు కోటేశ్వరరావు, గురుగుబెల్లి అశోక్, పొదిలాపు గోవింద, గొద్దు కోటేష్, సాయి, రాజు, బూర్జ మండల నాయకులు మజ్జ రాంబాబు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బొబ్బిలిపేటలో పూడికతీతలు

విశాలాంధ్ర -ఆమదాలవలస: మండలంలో వి బొబ్బిలి పేట గ్రామ పంచాయతీ లో సర్పంచ్ గోండు రమణ మూర్తి ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ వేశారు. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారని, పంచాయతీల్లో నిధులు అరకుర ఉండటం సర్పంచ్ ఆధ్వర్యంలోని పనులు నిర్వహణ చేశారు. రామాంజనేయ వీధి, గొల్ల వీధి, దండేపల్లి రోడ్డు ప్రాంతాల్లో మురికిని తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. వార్డ్ మెంబర్ చింతాడ అప్పారావు గ్రామ కార్యదర్శి బి పూర్ణిమ ఉన్నారు.

ప్రజలను మేల్కొల్పండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో ప్రభుత్వ పాలన తీరును ప్రతీ ఒక్కరు గమనిస్తూనే ఉన్నారని, పథకాల పేరుతో మభ్యపెట్టి ఓట్లు గుంజుకుంటున్న నేపథ్యంలో ప్రతీ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్జే ఫంక్షన్ హాల్‌లో పార్టీ కేడర్‌ను సమాయత్తపర్చే కార్యక్రమాలపై సమీక్షించారు. తెలుగుదేశంపార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన "బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమం పై శిక్షణ నిర్వహించారు. నియోజకవర్గంలో మున్సిపాలిటీ, నాలుగు మండలాల్లోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు పార్టీ విధానాలు, కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీలోని వివిధ స్థాయిల్లో కేడర్ ప్రజలను మేల్కొల్పి వారికి చేరువగా ఉంటూ వారికి పరిస్థితుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. పథకాల మాయలో పడి భవిష్యత్ పాడు చేసుకోవద్దని వివరించాలని కోరారు. ఓటర్ల సర్వేను కూడా అధికార పార్టీ నాయకులు ప్రభావితం చేస్తున్నందున కేడర్ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్థాయిల్లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీడి వ్యాపారులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

కార్మికులను దొంగలుగా ముద్ర వేస్తున్నారు
పరిశ్రమలను వెంటనే తెరవాలి : కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ జీడి ఉత్పత్తి సంఘం నాయకులు కార్మికులను దొంగలుగా ముద్ర వేసి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, జీడి పరిశ్రమలు వెంటనే తెరిపించి కార్మికులకు భృతి కల్పించాలని జీడి కార్మికుల సంఘం అధ్యక్షులు కొవ్వూరు భీమారావు, కార్యదర్శి బొమ్మాళి తాతయ్యలు అన్నారు. శుక్రవారం కార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీడి పరిశ్రమల్లో పలాస కాశీబుగ్గకు చెందిన సుమారు 25వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, గతంలో దొంగతనం ఆరోపణలు ఏ కార్మికుడుపై రాలేదని గుర్తు చేశారు. పలాసకు చెందిన పొట్నూరు బాలాజీ జీడి పరిశ్రమలో ప్రతి రోజు ఆ కంపెనీలో పని చేస్తున్న మహిళాకార్మికులపై నిందలు ఆయన వేస్తున్నారని ఆరోపించారు. లండ రమణ అనే కార్మికుడు బాలాజీ పరిశ్రమలో రెండేళ్లుగా 10 లక్షల రూపాయలు విలువైన జీడిపప్పు దొంగతనం చేశాడని, ఆరోపణలతో జీడి ఉత్పత్తిదారుల సంఘం ఇటీవల సమావేశం నిర్వహించి పరిశ్రమలకు బంద్ పిలుపునివ్వడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. యజమానులు, కార్మికులను చులకగా చూస్తున్నారని ఆరోపించారు. లండ రమణపై వ్యాపారులు తప్పుడు ఆరోపణలు చేస్తూ దొంగగా ముద్ర వేశారని, యజమానిపై కార్మికుడు లండ రమణ దాడి చేశారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యాపారే కార్మికుడు లండ రమణపై దాడికి ప్రయత్నించారని అన్నారు. వ్యాపారులు పిలుపునిచ్చిన బంద్‌ను అనేక పరిశ్రమలు పాటించలేదని, కార్మికులకు నోటీసులివ్వకుండా బంద్‌కు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. వ్యాపారులు ఒప్పందాన్ని ఉల్లంఘించారని, నిజనిర్ధారణ చేసి పరిశ్రమలను తెరిపించాలని అన్నారు. తాము దొంగలకు సహకరించమని, కార్మికులపై వస్తున్న ఆరోపణలను నిరూపణ చేయాలని కోరారు. బంద్ వలన రోజుకు 40 లక్షల రూపాయల ఆదాయాన్ని ఉపాధి రూపేన కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది కార్మికులను మార్చుకునే వెసులుబాటు జీడి పరిశ్రమదారులకు ఉందని, దొంగతనం ఆరోపణ వస్తున్నా కార్మికులను రెండేళ్లుగా ఎందుకు తొలగించి మార్చుకో లేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించకపోతే తమ పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరిశ్రమలు తెరిపించి దొంగతన ఆరోపణలను రుజువు చేసే బాధ్యత జీడి ఉత్పత్తిదారుల సంఘంపై ఉందని అన్నారు. సమావేశంలో అంబటి క్రిష్ణమూర్తి, తామాడ రాములు ఉన్నారు.

ఘనంగా పవన్‌కళ్యాన్ జన్మదినోత్సవ వేడుకలు

విజయవంతమైన రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: జిల్లాలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో జిల్లా పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం ప్రతినిధులు పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్ జిఓ హెూం వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని వ్యాపారవేత్త బలభద్రుని రాజా, దళిత జెఎసి ఛైర్మన్ డా.కంత వేణులు మెగా ఫ్యామిలీ అభిమానులతో కలిసి ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం జిల్లా నేతలు గొర్లె కిరణ్, పి. కిరణ్ రెడ్డి, బడే మోహన్ ల సారధ్యంలో అభిమానులు రక్తదానం చేశారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈసందర్భంగా అతిధులు బలభద్రుని రాజా, డా.కంత వేణులు మాట్లాడుతూ మెగా ఫ్యామిలీ అభిమానులు రక్తదాన శిబిరాల నిర్వహణలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. తమ అభిమాన నటుడు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకుని అభిమానులు రక్తదానం చేయడం పట్ల వారిని అభినందించారు. ఈసందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ ఆపద సమయంలో ఉన్న వారిని ఆదుకోవడంలో రక్తం ఎంతగానో ఉపయోగపడు తుందని, అటువంటి విలువైన రక్తదానాన్ని మెగా ఫ్యామిలీ అభిమానులు విరివిగా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీం రామ్ చరణ యువత శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు లింగాల హరీష్, గౌతమ్, సిద్ధు, జిల్లా పవన్ కళ్యాణ్ అభియాన సంఘం ప్రతినిధులు వెయ్యిల చంటి, జి.సాయి

విజయ్, టి.శేఖర్, సిహెచ్ చరణ్, ఆలిండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పుక్కల నవీన్, బాను,గిరి, సిక్కోలు అబ్బాయి బన్నీ, రమణారెడ్డి, పవన్ రాయల్, సాయిధరమ్ తేజ్ యువత అధ్యక్షుడు జోగిపాటి వంశీ, కిరణ్, వరుణ్ తేజ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు శీర రాజు, పంకు మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చు

- పంచాయతీ స్థాయి నుండి ధరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వివిధ సంఘాలకు ప్రధానమంత్రి విశ్వకర్మ పై అవగాహన పర్చాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులు ఆన్ లైన్ చేసుకొనుటకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు లక్ష రూపాయల నుండి రెండు లక్షల రూపాయలు వరకు వస్తాయన్నారు. రిజిస్ట్రేషన్లు ఎక్కువ చేస్తే నిధులు ఎక్కువగా వస్తాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సి.యస్.సి.లు ప్రజలకు అవగాహన కల్పించాలని, అవకాశం ఉన్న వరకు ఎక్కువ మంది రిజిస్ట్రేషన్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత శిక్షణకు సంబంధిత శాఖల

చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐడి కార్డు, సర్టిఫికెట్ ద్వారా గుర్తింపు ఇవ్వబడునని, వ్యాపారాభివృద్ధికి ఋణాలు ఇవ్వబడు తుందని వివరించారు. రోజుకి 500 రూపాయలు ఇన్సెంటివ్‌తో ఐదు రోజులు మరియు 15 రోజుల శిక్షణ కార్యక్రమాలు, రూ.15000/-లు వరకు పనిముట్ల ఇన్సెంటివ్, డిజిటల్ ట్రాన్సాక్షన్ పై నెలకు 100 ట్రాన్సాక్షన్స్ వరకు ట్రాన్సాక్షన్ రూపాయి చొప్పున కమిషన్ ఉంటుందని తెలిపారు. ఈ పథకం కింద నమోదైన కళాకారులు, కళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్, బ్రాండింగ్ మద్దతు ఇవ్వబడునని పేర్కొన్నారు. పరిశ్రమలు శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ రిజిస్ట్రేషన్ కు అర్హతలు కుటుంబంలో ఒకరు మాత్రమే రిజిస్ట్రేషన్ కు అర్హులన్నారు. 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగి, వారి పూర్వీకుల నుండి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు ప్రధానమంత్రి విశ్వకర్మ క్రింద నమోదు చేసుకోవడానికి అర్హులని వివరించారు. లబ్ధిదారుడు కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం యొక్క క్రెడిట్ ఆధారిత పథకాల కింద రుణాలు "పొంది ఉండకూడదని(రుణాన్ని తిరిగి చెల్లించిన వారు అర్హులు) పేర్కొన్నారు. కుటుంబం లో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే వారు ఈ పథకానికి అర్హులు కారని, 500 రూపాయల ఇన్సెంటివ్స్ తో ఐదు రోజులు 15 రోజుల శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఆర్డిఎ పిడి విద్యాసాగర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్, పరిశ్రమల శాఖ ఎడిలు రమణారావు, రఘునాథ్, డిఎల్డిఓ వాసుదేవర రావు, కిరణ్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వాలంటీర్‌పై దాడి : కేసు నమోదు

విశాలాంధ్ర-నందిగాం : స్థానిక ఆరవ క్లస్టర్ గ్రామ వాలంటీర్ అయిన గున్న విజయ్ బాబు పై అదే క్లస్టర్ కి చెందిన ప్రగడ ఆనందరావు శుక్రవారం దాడి చేసినట్లు ఎస్సై మహమ్మద్ అమీర్ అలీ పేర్కొన్నారు. ఆయన చెప్పిన వివరాలిలా ఉన్నాయి. ఆనందరావు బంధువుకి జగనన్న విద్యాదీవెన రాలేదని, దీనికి కారణం వాలంటీరు అడ్డుపడ్డారని, విజయబాబు చెంపపై కొట్టారు. దీంతో వాలంటీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందరావు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి యువశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కొర్రాయిపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు పాపారావు (గబ్బర్ సింగ్) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు.నిరుపేద అయిన కుటుంబ యజమాని పాపారావు మృతి చెందిన మరణ వార్త విన్న యువశక్తి ఫౌండేషన్ ముఖ్య సభ్యులు బొడ్డ జగదీష్ 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతుడు కుటుంబ సభ్యులు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రత పూజలతో కిక్కిరిసిన దేవాలయాలు

విశాలాంధ్ర-పాతపట్నం : మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి.మూడవ శ్రావణ శుక్రవారం పూజలు పాతపట్నం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయంలో మహిళలూ అమ్మవారిని దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వరలక్ష్మి పూజాలో విశేషంగా పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు, అలాగే కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం లో కూడా వరలక్ష్మి పూజా నిర్వహించారు శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో ఈవో టి.వాసుదేవ రావు ఆధ్వర్యంలో పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు జి.సంతోష్‌కుమార్ ఆచార్యులు ఆధ్వైర్యంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన, సహస్రనామార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలందాలి

- ఇదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశయం
- ఏపీ శాసనసభాపతి తమినేని సీతారాం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : రాష్ట్రవ్యాప్తంగా అణగారిన వర్గాల ప్రజానీకం ముఖాల్లో చిరునవ్వులు చూడటమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్ పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు. కొత్తగా అర్హులైన పింఛన్ దారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి పేదవాడికి కూడా తప్పనిసరిగా పెన్షన్ వచ్చేలా పనిచేస్తున్న ఘనత వైసీపీ సర్కార్ దే అన్నారు.గత ప్రభుత్వంలో ప్రతి నెల ఒకటో తేదీన మీ ఇంటికి వచ్చి మీకు పెన్షన్ ఇచ్చే రోజులు ఉన్నాయా అని ప్రజలను స్పీకర్ ప్రశ్నించారు.అలాగే గత ప్రభుత్వంలో ఒక పింఛన్ కావాలన్నా ఒక రేషన్ కార్డు రావాలన్న లంచం ఇస్తే గాని పని జరిగేది కాదని అలాంటిది వై యస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎటువంటి లంచం లేకుండా సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డు వంటివి లంచాలకు, అవినీతికి తావు లేకుండా అందజేస్తున్నామన్నారు. పింఛన్ 2500నుంచి 2750వరకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు..ప్రభుత్వం వచ్చిన కాలం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి అవినీతి లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేవిదంగా ప్రభుత్వం కృషి చేస్తుంది అని అయన తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కెవిజి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్,మండల సచివాలయాల కోఆర్డినేటర్ అత్తులురి రవికాంత్ బీసీ సెల్ డైరెక్టర్ ముద్దడ రమణ, ఎస్ సి సెల్ డైరెక్టర్ ఎద్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి హరి, తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ఎప్పుడు పూర్తయ్యేది?

విశాలాంధ్ర-జలుమూరు: నరసన్నపేట నియోజకవర్గ సారవకోట మండలం నవతల ఎత్తిపోతల పథకం నిర్మాణాలు ఎప్పుడు పూర్తయ్యేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు కోట్ల రూపాయలు మంజూరు చేసి హిరమండలం, సారవకోట మండల సరిహద్దుల్లో ఈ పనులకు 2018లో శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా 2000 ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక. 2019లో వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చాక పనులు ముందుకు సాగలేదు. ఈ పథకంకు కేటాయించిన పరికరాలు పోతున్నాయి. తుప్పుపడుతున్నాయని అన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీపీ

విశాలాంధ్ర-సోంపేట : అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు అన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి ఒక్కరికి న్యాయం చేసేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కొత్త లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ నగిరి ప్రభావతి, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ, ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పొడుగు కామేష్, బొమ్మిడి ధర్మారావు, పంచాయతీ ఈఓ వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్ఎస్ స్కూల్‌లో మాతృభాషా పక్షోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక ఎన్టీఆర్ మున్సపల్ హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్ సమక్షంలో మాతృభాషా పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం "మాతృభాషల ఆవశ్యకత-సంస్కృత భాషా ప్రాధాన్యత " గురించి పాఠశాల విద్యార్థిని ,విద్యార్థులకు ఉపన్యాస పద్ధతిలో పోటీలు నిర్వహించారు. పిల్లలు భాష ఆవశ్యకత, మాతృభాష ప్రాధాన్యత ,సంస్కృత భాషా ఆవశ్యకతను గురించి చక్కని, ఆసక్తికర ఉపన్యాసాలను ఇచ్చారు. విజేతలకు ప్రశంసలను ప్రధానోపాధ్యాయులు, సంస్కృత అధ్యాపకులు ఆదిత్య అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దేవదత్తానంద్, వాడాడ శ్రీనివాస్, హరనాధం, పురుషోత్తం, చాడ శ్రీనివాస్, నిరంజన్, నీలకంఠం, చంద్రకళ, లక్ష్మీ బాయి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం కోసం ఎదురుచూపు

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంలోని కవిటి గ్రామానికి చెందిన పొల్లాయి మండల లక్ష్మీనారాయణ గత మూడు సంవత్సరాలుగా నోటి కాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద అయిన పొల్లాయి మండల లక్ష్మీనారాయణ వైద్యం కోసం అధిక మొత్తంలో ఖర్చు చేసి చికిత్స చేపట్టారు. ఈ క్రమంలో నాలుక తొలగించారు. ప్రస్తుతం ద్రవపదార్థం ద్వారా ఆహారం తీసుకుంటున్నాడు. పొల్లాయి మండల లక్ష్మీనారాయణ కు భార్య ఢిల్లీశ్వరి తో పాటు దివ్య,ప్రణీత్ అనే సంతానం కలరు.కుటుంబ పెద్దదిక్కు అనారోగ్యం పాలు కావడంతో దాతల సహకారం కోసం ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఉషోదయ యువజన అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్ కోరారు. సహాయం చేయాల్సిన దాతలు 9440713603 ఫోన్‌పే నెంబర్ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సౌజన్యంతో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు పావినాయుడు కుమారుని పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 79 మంది అనాధులు, వృద్ధులు, వికలాంగులకు రెండు పూటలకు సరిపడే భోజనాలను ఇంటింటికి సేవా రథం ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి ఎన్.అప్పారావు, అధ్యక్షులు రోణంకి హేమా చలం, ఎందు దొర, సిద్ధిరి మధుసూధనరావు, కొర్రాయి బాలక్రిష్ణ, ఎం.కొండలరావులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం పెంచేందుకే మట్టి సేకరణ కార్యక్రమం

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : భారతీయ జనతా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆజాద్ కు అమృతోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ స్థానిక నాయకులు శుక్రవారం ఉదయం శ్రీకాకుళం నగరంలో పలువురు వద్ద నుంచి మట్టిని సేకరించారు. ఈసందర్భంగా వేణుగోపాలం మాట్లాడుతూ అందరిలో జాతీయత, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. సేకరించిన మట్టిని ఢిల్లీకి తరలించనున్నట్లు తెలియజేశారు. పైడి హరికృష్ణ, పూజారి చెల్లయ్య, ఉమామహేశ్వరరావు, జామి ప్రసాద్, జగదీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు నివారించండి

విశాలాంధ్ర-సోంపేట : ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా విద్యుత్ కోతలు అధికమై ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారని సీడాప్ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఎపిఇపిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్‌కు లేఖ రాసారు. అలాగే ఫోన్‌లో కూడా ఈ సమస్యపై మాట్లాడినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కరెంట్ కోతలు అమలు చేయడం వలన ప్రజలు అసౌకర్యానికి గురౌతున్నారని అన్నారు. సమస్య తీవ్రతను తగ్గించేవిధంగా చర్యలుతీసుకుని సంబంధిత స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

అన్నా క్యాంటీన్‌కు రూ. 10వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానిక మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయ అవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీనుకు కోటబొమ్మాళి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవింద రాజులు శుక్రవారం తన జన్మదినం సందర్భంగా రూ.10వేలను అన్న క్యాంటీన్ నిర్వాహకులను అందజేశారు. అన్న క్యాంటీను ద్వారా వందలమంది పేదలకు రూ. 5లకే రుచికరమైన భోజనం అందించటం జరుగుతుందని, అలాంటి అన్న క్యాంటీనుకు తన వంతు సహాయసహకారం అందించటం సంతోషకరంగా ఉందని గోవిందరాజులు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో గోవిందరాజులు జన్మదిన వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో మండల కార్యకర్తలు, నాయకులు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, టీడీపీ నాయకులు కోరాడ పెద్ద గోవింద్, లాడి శ్రీనివాస్, చిన్న గోవింద, రామ్‌కుమార్, మద్ది క్రిష్ణారావు, తంగుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మకుమారి సిస్టర్స్ బాలమణి, ఈశ్వరమ్మ, గాయత్రీలు మండల పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

విశాలాంధ్ర-పలాస: విద్యార్థులు చిన్నప్పటికీ నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టడం అలవాటు చేసుకోవాలని పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దబ్బీరు భవానీశంకర్ అన్నారు. శుక్రవారం మండలం రామక్రిష్ణాపురం వద్ద గల సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు దాచుకున్న డబ్బులతో పలాస ప్రభుత్వాసుప్రతిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాచుకున్న పాకెట్ మనిని రోగులకు ఉపయోగపడే విధంగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరం, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ అగ్గున మేఘన, శ్రీను, శరత్‌బాబు, అనుదీప్,లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కామక త్రినాధరావు అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పాతపట్నం: నియోజకవర్గం కొత్తూరు మండల కేంద్రంలో జెడ్పీటీసీ కామక భాగ్యవతి భర్త,విశ్రాంత మండల విద్యా శాఖాధికారి,రాష్ట్రపతి అవార్డు గ్రహీత,కొత్తూరు మండల జగనన్న సచివాలయ కన్వీనర్ కామక త్రినాధరావు మెళియాపుట్టి మండలంలోని జలకలింగపురం గ్రామం వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందినందున, పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి,సదరు పార్థివ దేహానికి శవపంచనామా కార్యక్రమం నిర్వహణ గూర్చి సంబంధిత అధికారులు, వైద్యులతో నేరుగా మాట్లాడి,నేడు టెక్కలి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నందు శవపంచనామా కార్యక్రమం నిర్వహించిన అనంతరం త్రినాధరావు మాస్టారు పార్థివ దేహంతో అతని స్వగ్రామమైన కుంటిభద్ర చేరుకుని అంత్యక్రియ కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి,కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతి మరియు వారి కుటుంబ సభ్యులను కలసి వారిని పరామర్శించి అతని మృతిపై తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. పార్టీకి విశేష సేవలందించిన అతని కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం సూదికొండ ప్రాంతంలో వినాయకగుడి నుంచి రెడ్డి భవనం వరకు 4.85 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు, 1.7 లక్షల రూపాయలతో సిసి కాలువ, కౌన్సిలర్ వీధిలో 1.15 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, త్రిమూర్తుల స్వామి గుడి వీధిలో 1.9లక్షల రూపాయల వ్యయంతో రెండు కాలువలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో మురికికాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బృందావతి, వైసీపీ పట్టణాధ్యక్షులు సింహాచలం, శిష్టి గోపి, వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బెల్లాల శ్రీనివాస్, దున్న సత్యం, రవిరమేష్, అంబటి ఆనందరావు, కోఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాస్, జోగ తిరుపతిరావు, బగాది సింహాచలం, లోకేష్, మార్పు క్రిష్ణ కామేశ్వరరావు, చిన్న భాస్కరరావు, చిన్నారావు, డి.ఇ హరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-సోంపేట : విద్యార్థులకు కూడా చట్టాలపై అవగాహన అవసరమని సోంపేట జిల్లా కోర్టు 6వ అదనపు జిల్లా జడ్జి టి.భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సోదరభావం, స్నేహభావం, దేశభక్తి మొదలైన అంశాలపై శుక్రవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులకు గురైనా చట్టాన్ని, న్యాయాన్ని ఆశ్రయించి న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. సమాజంలో బాలికల పట్ల ప్రతి ఒక్కరు సోదర భావంతో వ్యవహరించాలని సూచించారు. బాలికల పట్ల అతిగా ప్రవర్తించిన యెడల అనవసర ఇబ్బందులకు గురౌతారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఏ.రాము, ఎసిడిపిఓ గోవిందరాజులమ్మ, ఎస్సై హైమావతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగభూషణరావు, ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం, సారవకోట గ్రామంలో, ఉజ్జయిని మహంకాళి వాలీబాల్ టోర్నమెంట్‌కు మాజీ శాసన సభ్యులు ఇన్‌చార్జ్ బగ్గు రమణమూర్తి విచ్చేసి ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన ప్రశంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, ఐటీడీపి కన్వీనర్ సురవరపు తిరుపతి రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరి భాస్కర్ రావు, మాజీ ఎంపీటీసీ కోన వెంకటేష్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

4న అన్ని మండల కార్యాలయాల వద్ద జరుగు ధర్నాను విజయవంతం చెయ్యండి

- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 4న జిల్లావ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాలు వద్ద ధర్నాలు జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కోటబొమ్మాళి సిపిఎం పార్టీ నాయకులు హనుమంతు ఈశ్వరరావులు పిలుపు నిచ్చారు. సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మండలం కోటబొమ్మాళి, ఊడికిలపాడు, చీపురుపాడు గ్రామాల్లో ప్రసారం చేసి అనంతరం చీపురుపాడులో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి, సచివాలయ కార్యదర్శికి వినత పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలోనూ ధరలు అదుపు చేయడం లోనూ ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వలన ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పెరిగిందారులకు అనుగుణంగా ప్రజల ఆదాయాలు పెరగడం లేదని దీనివలన పేద మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని వారు అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జింగ్ పెంచబోమని ఇచ్చిన హామీని గాలికి వదిలేసారని వారు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. దీనికి తోడు ఇళ్లకు స్మార్ట్ మేటర్ పెట్టి ప్రజల్ని మరింత దోపిడీ చేయడానికి చూస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహ రించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ఆర్థిక భద్రత అవసరం

విశాలాంధ్ర-నరసన్నపేట: సమాజంలో ప్రతీ కుటుంబానికి ఆర్థిక భద్రత అవసరమని తహశీల్దార్ ఏ.సింహాచలం అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్.ఐ.సి బ్రాంచ్ కార్యాలయంలో 67వ భీమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన తహశీల్దార్ సింహాచలం మాట్లాడుతూ ప్రపంచంలో ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఉత్తమ సేవలందించే ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్.ఐ.సిలో భీమా చేసుకోవటం వలన ఆర్థికంగా భద్రత పొందవచ్చని అన్నారు. అనంతరం సీనియర్ బ్రాంచ్ మేనేజర్, ఎమ్.నేతాజీ మాట్లాడుతూ ఎల్.ఐ.సిలో అన్ని వయస్సుల వారికీ, వర్గాల వారికీ అనువైన పాలసీలు వున్నాయని, ప్రీమియం చెల్లింపు కోసం ఇప్పుడు వున్న అనేక పద్ధతులకు తోడుగా బ్యాంక్ డెబిట్ కార్డుల స్వయిపింగ్ ద్వారా, ఫోన్ పే, యుపిఐ పేమెంట్ పద్ధతులను కూడా కొద్ది నెలల్లో ప్రవేశపెట్ట బోతున్నట్లు నేతాజీ తెలిపారు. 67వ భీమా వారోత్సవాల సందర్భంగా స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, డిగ్రీ విద్యార్థులకు వకృత్వపు పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతు లందించారు. ఈకార్యక్రమంలో ఎల్.ఐ.సి కార్యాలయ ఉద్యోగులు, గౌతమ్, కాందీషన్, ధనం, నరేష్, ఆచారి, మురళీధర్, అంజనీకుమారి, పార్థసారథి, మధుబాబు, ఆర్.సురేష్‌బాబు, ఏజెంట్లు, వై.వి.రమణ, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో జీవిత బీమా వారోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: భారతీయ జీవిత బీమా సంస్థ శ్రీకాకుళం బ్రాంచ్‌లో శుక్రవారం 67వ బీమా వారోత్సవాలు నిర్వహించారు. భీమ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంవి తిలక్, రీజినల్ హెడ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విచ్చేశారు. ఎల్ఐసి చీఫ్ మేనేజర్ సత్యనారాయణ సాహు మాట్లాడుతూ గడచిన వార్షిక సంవత్సరంలో రూ.2.25 లక్షల క్లైములను పరిష్కరించి 2 లక్షల తొమ్మిది వేల కోట్ల రూపాయలను క్లైముల రూపంలో పాలసీదారులకు చెల్లించడం జరిగిందని, ఈ సందర్భంగా పాలసీదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగులు. ఏజెంట్ మిత్రులు ఫీల్డ్ ఫోర్స్ అందరూ మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఎంవి తిలక్. ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఎల్ఐసి అనేది ఈరోజు ఒక ఇన్సూరెన్స్ బ్రాండ్ గా ప్రజల్లో ఇన్సూరెన్స్ అంటేనే ఎల్ఐసి అని 130 మంది కోట్ల ప్రజల్లో ఒక గట్టి నమ్మకం ఏర్పరచుకున్నదని ఎల్ఐసి దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక వెన్నెముకగా ఉన్నదని తెలియజేశారు. రెండవ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హైస్కూల్ విద్యార్థులకు డ్రాయింగ్ మరియు వ్యాసరచన పోటీలు ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్‌లో జరగనున్నవి. నాలుగో తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు డిగ్రీ విద్యార్థులకు ఎలక్యూషన్ కాంపిటీషన్ జరగనున్నది. ఐదవ తేదీ ఇన్సూరెన్స్ అవగాహన ర్యాలీ ఉంటుందని ఈ బీమా వారోత్సవాల్లో ఉద్యోగులు ఏజెంట్ మిత్రులు అందరూ కూడా ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో అచ్యుతవల్లి, లక్ష్మీ, మధుసూదన్‌రావు, తారక్, గిరిధర్, రామకృష్ణ వలసయ్య, దామోదర్‌రావు, అప్పన్నదొర, ధనుంజయరావు, రమణమూర్తి, ప్రతాప్, సూర్యప్రకాశరావు. తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లను నరికేశారు : అర్ధరాత్రి ఘాతుకం

విశాలాంధ్ర-పలాస: వృక్షో రక్షిత రక్ష: నినాదంతో చెట్లను విరివిగా పెంచాలని తద్వారా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగ పడతాయని పెద్దలు చెబుతుండగా దానికి విరుద్ధంగా పచ్చచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి తమ కక్షను తీర్చుకుంటున్నారు. కాశీబుగ్గ దుర్గాకళామందిరం పూర్వపు యజమాని ప్రముఖ వైద్యులు రాజకుమార్ తండ్రి ముకుంద పండాకు చెందిన 100 ఎకరాల మామిడి, కొబ్బరి తోటల్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఇష్టానుసారంగంగా ప్యాక్షన్ తరహాలో చెట్లను నరికేశారు. శుక్రవారం యాదతదంగా ఉదయం 6 గంటల ప్రాంతంలో 90 సంవత్సరాల పండా తోటకు వెళ్లి పరిశీలించగా అక్కడక్కడ చెట్లు నరికేసినట్లు గుర్తించారు. ఈ విషయమై కాశీబుగ్గ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు 2 లక్షల రూపాయలు అంచనా. కొద్దిరోజుల క్రితం పండా కుమారుడు డాక్టర్ రాజకుమార్‌కు చెందిన తోట రక్షణ గోడను కాశీబుగ్గకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి స్థల వివాద ఆరోపణలతో జెసిబి తెచ్చి కూల్చేశారు. కూల్చిన రెండోరోజుకే చెట్లను నరికేశారు. డాక్టర్ రాజకుమార్ చెన్నై ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయన తండ్రి పోలీసులకు గత 25న పిర్యాదు చేయగా కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వివాదం కొనసాగుతుండగా చెట్లను నరికేయడం తీవ్ర సంచలనం కలిగించింది. తనను కూడా హతమారుస్తామని బెదిరిస్తున్నట్లు పండా ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మొక్కలతో ఆరోగ్యం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మొక్కల పెంపకం ఓ చక్కని అలవాటుగా మార్చుకోవాలని డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ నిత్యానంద పట్నాయిక్ అన్నారు. గ్రీన్ ఆర్మీ సంస్థ శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మొక్కల పెంపకం పై అవగాహన కల్పించి, కళాశాల ప్రాంగణంలో కొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతు మొక్కలు నాటడం వాటిని పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని, దాంతో పాటు ఔషధ గుణాలు కల్గిన మొక్కలు నాటడం వాటి వేర్లు, ఆకులు వినియోగించడం వల్ల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు గోపాల్, శ్రీనివాసరావు, సినీ కళాకారులు రామక్రిష్ణ, అధ్యాపకులు శ్రీనివాస్, దుర్యోధన, సంతోష్, శివకుమార్, వరప్రసాద్, బృంధావన్, నాగేశ్వర రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పధకాల కేటాయింపుల్లో పక్షపాతం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో అధికార వైసిపి ఆగడా లకు అంతు లేకుండా పోయిందని, ప్రశ్నించే వారిపై కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తు నోళ్ళు నొక్కేస్తున్నారని, భారత రాజ్యాం గాన్ని కాలరాస్తూ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్న ఘనత దక్కించుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యదర్శి నారా లోకేష్ "యువగళం" పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావ పాదయాత్రను నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం చేపట్టారు. ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుండి పాత బస్టాండ్ కూడలి వరకూ పాదయాత్రతో హోరెత్తించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు, కింజరాపు యర్రంనాయుడుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కేడర్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వాని గద్దె దింపకపోతే రాష్ట్రంలో ప్రజల భవిష్యత్ అంధకారమైపోతుందని, ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా పోయిందని, ధరల నియంత్రణలో విఫలమయ్యారని, మహిళల పట్ల దాడులు పెరిగాయని, అస్తవ్యస్థ నిర్ణయాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, మద్యం మాఫియా, ఇసుక దోపిడీ మాఫియాల ప్రాభవం పెరిగిందని, ఎప్పటికప్పుడు బటన్ నొక్కానని చెప్పుకునే ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పేదలకు పధకాలు అందుతున్నాయో లేదో గమనించలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేసారు. రాష్ట్రంలో టీడీపీ హయాంలో నారా చంద్రబాబు నాయకత్వంలోనే పురోగతి సాధించగలదని ప్రజలు చర్చించుకుంటున్నారని, ఖచ్చితంగా రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని, తెలుగుదేశం అధికారంలోకి రావడం తధ్యమని అన్నారు. సంక్షేమ పధకాలు అందివ్వడంలో పక్షపాత ధోరణి అవలంభిస్తున్నారని, అర్హులైన వారు నోరెత్తి అడగలేని విధంగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఓటర్లు జాగురుకతతో వ్యవహరించాలని, ముఖ్యమంత్రి మోసాలకు బలైపోయి రాష్ట్రాని అప్పుల ఊబిలో కూరుకుపోకుండా అప్రమత్తంగా ఉండి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేలా తెలుగుదేశం పార్టీకి అధికారం అప్పగించాలని విజ్ఞప్తి చేసారు. పార్టీ నాయకులు కాళ్ళ ధర్మారావు, నందికి జానకిరావు, కొండా శంకర్, ఆశి లీలారాణి, బత్తిన క్రిష్ణయ్య, కాళ్ళ దిలీప్, పత్రి తవిటయ్య, బి. లోహిదాసు, ఆశి లీలారాణి, కె. లక్ష్మి, మణిచంద్ర ప్రకాష్, బాసుదేవ రౌళో, సదానంద రౌళో, దక్కత డిల్లీరావు, కాళ్ళ జయదేవ్, సాడి సహదేవ్, సంతోష్ పట్నాయిక్, ఎన్.కోటి, ఎమ్డీ బిలాలీ తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గడిచిన రెండురోజులుగా కోటబొమ్మాళి మండలంలో పగలు, రాత్రి అని తేడ లేకుండా సమయంలో పనిలేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ పక్క ఎండలు, మరో పక్క విద్యుత్ కోతలు ఉండటంతో వృద్దులు, చిన్నారులు, పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఇలా రోజుకు గంటలుగంటలు సమయం విద్యుత్ నిలుపుదల చేయటం, ముఖ్యంగా రాత్రి పడుకుందామనుకొనే సమయానికి విద్యుత్ తీయటంతో పగలంతా కష్టపడి వచ్చిన రైతులు, కూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించటం జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల విప్, కో-అప్షన్ మెంబర్, వివిధ కార్పోరేషన్ డైరెక్టర్లు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని శుక్రవారం ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్ సూచించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు అడిగిన సమస్యలకు అధికారులు పూర్తి సమాచారంతో ఉండాలన్నారు.

'మన మట్టి-మన దేశం'లో ప్రజలు భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు, జె.పి.నడ్డా సూచనల మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మన మట్టి-మన దేశం కార్యక్రమంలో దేశ ప్రజలందరూ భాగస్వాములు కావాలని బిజేపి జిల్లా ఉపాధ్యక్షురాలు, కొనతల మనమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలో పల్లిపేట జంక్షన్‌లో మన మట్టి-మన దేశం కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించి, కలశంలో వేసారు. అలాగే హరిశ్చంద్రపురంలో మన మట్టి-మన దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, కరకోల రామారావు, జిల్లా ఓబిసి కార్యవర్గ సభ్యులు, ఎండ శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి, ఏ.పి.మహరణ తదితరులు పాల్గొన్నారు.

పలాస విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.లోకేష్, జి.సార్థిక్, జి.లిఖిత్, డి.యుగంధర్, కె.నాగబినాయిలు అంతర్జాతీయ సంస్థ యూనిసెఫ్ మరియు ఎస్ఇఆర్‌టి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాం 2022-23 బూట్ క్యాంప్ మరియు గ్రాండ్ ఫినాలి పోటీల్లో విజయం సాధించారని పి.డి తవిటయ్య తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన రెగెనేరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్ అనే ప్రోజెక్టును విజయవాడలో 3రోజులు పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించి టాప్ 10 స్థానంలో నిలిచి పదివేల రూపాయల నగదు బహుమతి మెమెంటో మరియు ప్రసంశపత్రంను అందుకున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎలక్ట్రికల్ వాహనాల్లో బ్రేక్ వేయడం వలన విద్యుత్ ఉత్పత్తి చేసి ఆ విద్యుత్‌ను తిరిగి అదే వాహనంలో ఉపయోగించే బ్యాటరీను చార్జింగ్ చేయడం వలన విద్యుత్ శక్తిని మరియు చార్జింగ్ సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గైడ్ ఉపాధ్యాయులు జె.షన్ముఖరావు, ప్రధానోపాధ్యాయులు డి.దాసరధి, సిబ్బంది అభినందించారు.

2న మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మెగా రక్తదాన శిబిరాన్ని 2వ తేదీ నిర్వహిస్తున్నట్లు జన సైనికులు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేనని పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని రెండో తేదీ శనివారం రూరల్ మండలం సింగుపురం వివేకానంద క్రీడా మైదానంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జనసైనికులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాకుళం నియోజకవర్గ జనసేన అభ్యర్థి కోరాడ సర్వేశ్వరరావుతోపాటు రూరల్ మండల అధ్యక్షులు కూర్మారావులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జనసైనికులు అందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

దారి దోపిడీ...!

- ప్రజా సౌకర్యాల కల్పన ఏది...
- అధికార అండతో దురాగతాలు
- అక్రమాల నివారణ కమిటీ ఏమైంది
- ఉన్న వాటిని దర్జాగా కబ్జా...
- ప్రజల ఇబ్బందులు పెట్టావా
- ఓటు సీటు రాజకీయాలు

విశాలాంధ్ర-ఆముదాలవలస: పురపాలక సంఘ పరిధిలో భూ దురాక్ర మణలకు అంతు లేకుండా పోతుంది. అధికార పార్టీ కండువా ఉంటే చాలు ఎంతటి పనైనా సునాయాసంగా చేయవచ్చు. సందుల్లో, ఇతర ఇతర వీధుల్లో ఆక్రమంలో ఏ విధంగా ఉన్నప్పటికీ పట్టణ ప్రధాన రహదారి మార్గం గుండా ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. నిత్యం రద్దీగా ఉండే మార్గాల్లో కాళీ జాగా కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు ఉత్సవ విగ్రహాలు గా మారారు. అధికార పార్టీ అండతో చెడ్డి గ్యాంగ్ దురాక్రమములకు అక్షరాభ్యాసాలు చేస్తున్నారు. కొంతమంది పెద్దలు వాటిలో షాపులు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఇంకొందరు పార్టీ నాయకుల పేరు చెప్పి రోడ్డుపైన వ్యాపారాలు చేసుకునేందుకు రోజువారి సుంకం వసూలు చేసి వారికి అవకాశం కల్పిస్తున్నారు. ఇదంతా రెండవ తరగతి నాయకులు నడుపుతున్న తీరు.

దారి దోపిడి... ఒక బడా వ్యాపారి తన వ్యాపారాన్ని విస్తరించేందుకు పోర్టికో ను ఏకంగా రోడ్డుపైకే కట్టేస్తున్న కనీసం నోటీసు కూడా ఇవ్వలేని దుస్థితిలో కమిషనర్ ఉన్నారు అనే విమర్శ ఉంది. ఈయనకి తెలుగుదేశం నాయకుల తోపాటు వైసీపీ నాయకుల అండ ఉందని బహిరంగంగా అంటున్నారు. నిజానికి ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యాపారిగా అందరి వద్దకు వెళ్లి తన ఆత్మఘోష వినిపించి కొంత మొత్తంలో పారితోషకాన్ని అందించు కుని కళ్యాణ మండపాన్ని విస్త రిస్తున్నాడు. స్థానిక వైసీపీ నాయకులు సహకారాలు ఉన్నాయి. కృష్ణాపురం వద్ద పాఠశాలను ఆనుకొని ఉన్న టాయిలెట్ నిర్మించేందుకు కేటాయించిన స్థలంలో ఒక బడా ట్రాన్స్పోర్ట్ కు చెందిన వ్యక్తి ఏకంగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఇందిరా గాంధీ విగ్రహం దరిలో ప్రమాదకరమైన మలుపు ఉన్నప్పటికీ స్థానిక చోటా నాయుడు అండతో రోడ్డుపై బజ్జీలు దుఖానం, అటు వైపు బడ్డీ ఏర్పాటు చేయించారు. పట్టణంలో పెద్ద మనుషులుగా చాలామంది అవుతూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. దీంతో భూ దందా దారులు రెచ్చిపోయి ఎక్కడికక్కడ దర్జాగా కబ్జాలు చేస్తూ పబ్బం గడుపు తున్నారు. కనీసం ప్రయాణికులు వెళ్లేందుకు దారి కూడా లేకుండా దోపిడీ చేసి దౌర్జన్యంగా నిర్మాణాలు చేపడుతున్న కనీస చర్యలు చేపట్టడం లేదు.

- ఓటు సీటు రాజకీయాలు... ఓట్లు సీట్లు కోసమే రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను పాలకులు పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. రహదారిపై అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు అటువైపు చూడొద్దని ఇది క్యాంపు కార్యాలయం నుంచి వచ్చిన మాట అంటూ అధికారులను హడలెత్తిస్తుంటారు. ఈ చెడ్డి గ్యాంగ్ అరాచకాలకు పట్టణంలోని ప్రజల తో పాటు ప్రయాణికులు వాహన సాధకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరి చేస్తున్న చెడు నాయకులపై పడుకున్నప్పటికీ కనీస చర్యలు లేవు. రద్దీ ప్రాంతాల్లో ప్రజలు ఆటో అధికారులతో పాటు ఇటు కొంతమంది నాయకుల పైన కూడా నిందలు వేస్తూ వీరి పాలన ఇంతే లే అంటూ వెళ్ళిపోతున్నారు. పేదవాడి పైన ప్రతాపం చూపిస్తున్న అధికారులు ఆక్రమణదారులను, నిర్మాణదారులను అడ్డుకునే సాహసం చేయలేకపోతున్నారు. పట్టణంలో జరుగుతున్న సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- దేవాలయ కమిటీ సభ్యులు కూడా... ఎటువంటి వారైనా స్వార్థానికి లోబడతారని వీరిని చూస్తే అర్థమవుతుంది. స్వచ్ఛంద సేవా పరులు, ఎటువంటి స్వార్థం లేని వ్యక్తులను దేవాలయాల కమిటీల్లో సభ్యులుగా నియమిస్తారు. వారికి ఎంతో ఉదారమైన స్వభావం ఉంటుంది అటువంటివారే కమిటీలకు అర్హులు. ఆముదలవలసలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటుందనే చెప్పొచ్చు. చెరువు గర్భాలను సైతం ఆక్రమిస్తున్నారు. పెద్ద చెరువులో నాలుగు ఇల్లు కట్టుకునేందుకు పాలకులు ఓకే చెప్పారు అంటూ ప్రచారం జరుగుతుంది. అదే వ్యక్తికి షుగర్ ఫ్యాక్టరీ వద్ద మరో రెండు స్థలాలు అంట కట్టినట్టు కూడా తెలిసింది. చెడ్డి గ్యాంగ్ లో మరి కొంతమందికి కూడా ఈ స్థలాలను అందించినట్లు ప్రచారం జరుగుతుంది. వాణిజ్య సముదాయంలో ఖాళీ స్థలాన్ని ఒక ప్రాంతానికి చెందిన వ్యక్తికి కట్ట పెట్టినట్లు తెలిసింది. మార్కెట్లోని బడ్డీలను, ఫుట్ పాత్ లను ఆక్రమించి రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టుకునే వారికి రోజుకు వంద నుంచి 300 వరకు వసూలు చేస్తూ గుండా గిరి ప్రదర్శిస్తుంటారు. స్థానికంగా పెద్ద వ్యాపారం చేస్తున్నవారు కూడా తోపుడుబండు వ్యాపారుల వద్ద రోజువారీ కలెక్షన్లు చేయటం విడ్డూరంగా ఉందని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు అక్రమ నిర్మాణాలపై ట్యాక్స్లు వేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నట్లు చెబుతుండడం విశేషం. ఇటువంటి చెడ్డీ గ్యాంగ్ ఆగడాలను అరికట్టాల్సిన యంత్రాంగం ధృతరాష్ట్ర పాలన చేస్తున్నట్లు తెలుస్తుంది.

- ఆక్రమణల నివారణ కమిటీ ఏమైంది... పట్టణంలోని చెరువు గర్భాలు, రోడ్లు, రహదారులు, ఇరుకు సందులు దురాక్రమణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వైసిపి పాలన ప్రారంభంలో కమిటీని వేశారు. పట్టణంలో ఎక్కడ దురాక్రమణ జరిగిన తక్షణమే వాటిని తొలగించాలని కమిటీ తీర్మానం చేశారు. అలాగే అక్రమ నిర్మాణం చేపట్టిన వెంటనే వాటిని తొలగించి మరొకరు ఆక్రమించాలంటేనే భయపడే విధంగా ఉండాలని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అధ్యక్షతన మొదట్లో నిర్ణయించారు. రెవిన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎలక్ట్రికల్ అధికారి, పోలీస్ అధికారి, ఇతర స్వచ్ఛంద సేవ వ్యక్తులతో ఆక్రమాల నివారణ కమిటీ ఏర్పాటు చేశారు. పైరవీలు ఓటు సీటు రాజకీయాలతో ఆ నిర్ణయాలకు స్వస్తి చెప్పినట్లు తెలిసింది. ఏమిటీ ఆక్రమణ అని ప్రశ్నించే వారికి ఏదో కడుపు కూటి కోసం వ్యాపారం చేసుకుంటున్నడని వాడిపై మనకెందుకు ఈ ప్రతాపమంటూ దాటు వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పట్టణంలో నడవడానికి కూడా చోటు దొరక్క మొత్తం దారిని కూడా దోపిడీ చేసే సమర్థులు ఉన్నారని తేటతెల్లమవుతుంది.